
# శవ - వస్త్రం




హిందీ మూలం: శ్రీ ప్రేమచంద్

తెలుగు అనువాదం : వాసిరెడ్డి సుబ్బారావు

గుడిసె వాకిటి ముందు తండ్రీ-కొడుకూ యిద్దరూ ఒక ఆరిపోయిన చలిమంట కెదురుగా నిశబ్దంగా కూర్చుని ఉన్నారు. లోపల కొడుకు పెండ్లాం, యువతి బుధియా ప్రసవవేదనతో బాధపడుతూఉంది. వుండీ వుండిఆమె నోటి నుంచి హృదయాన్ని కలచివేసే అరుపులు వినవస్తున్నాయి. ఇద్దరూ గుండె చిక్కబట్టుకుని కూర్చుని వున్నారు. అది శీతాకాలపు రాత్రి. ప్రకృతి ప్రశాంతంగా వుంది. వూరంతా చీకటిలో లీనమై వుంది.

"బ్రతికేటట్లు కనిపించడంలేదు. పగలంతా ఉరుకులు పరుగులుతో గడిచిపోయింది. వెళ్ళి చూసిరా " అన్నాడు ఘీసూ.

" చచ్చేది త్వరగా చావరాదు ! చూసి ఏం చేసేది ? అన్నాడు విసుక్కొని మాధవ్.

" నువ్వు ఎంత కఠినాత్ముడివిరా ! సంవత్సరమంతా సుఖమనుభవించిన మనిషితో ఇంత కృతఘ్నతా ?

" ఆమె కాళ్ళు చేతులూ కొట్టుకుంటూ బాధపడుతూ వుంటే నేను చూడలేనయ్యా ! "

నిరుపేద కుటుంబం. వూళ్ళో చెడుపేరు. ఒక రోజు పనిచేస్తే ఘీసుకు మూడురోజులు విశ్రాంతి కావాలి. ఇక మాధవ్ ఎంత పనికి మాలినవాడంటే, అర్ధగంట పని చేస్తే గంటసేపు 'సొంగ' తాగాలి. అంత పనిదొంగ. అందుకని వాళ్ళకు ఎక్కడా కూలిపని దొరకదు. ఇంట్లో పిడికెడు గింజలుంటే ఇకపనిచేస్తే ఒట్టు. రెండు-మూడు రోజులు పస్తుంటే ఘీసూ చెట్టు ఎక్కి కట్టెలు కొట్టి తెస్తాడు. మాధవ్ బజారుకు వెళ్ళి అమ్మి వస్తాడు. చేతిలో ఆ డబ్బులున్నంతవరకూ, ఇద్దరూ వూరికే తిరుగుతారు. పస్తు ఉండవలసి వచ్చినపుడు మళ్ళా కట్టెలు కొట్టుకు రావడమో, లేక ఏదయినా కూలిపని చూసుకోవడమో జరుగుతుంది. వూళ్ళో పనిదొరకక కాదు సుమా ! అది రైతులు ఎక్కువగా వున్నవూరు. కష్టపడి పనిచేసేవారికి ఎన్నో పనులుంటాయి. పనులు వత్తిడిగా వున్నపుడో, గత్యంతరంలేని పరిస్థితులలోనో, పోనీ ఇద్దరూ కలసి ఒక మనిషి పనైనా చేయకపోతారా? అని తృప్తిపడి వీళ్ళను పనికి పిలుస్తారు. ఇద్దరూ సాధువులైనా బాగుండేది. ప్రత్యేకించి నియమనిష్టలను పాటించవలసిన అవసరముండేది కాదు. ఇదీ వారి స్వభావం. చాలా విచిత్రమయిన జీవితం వారిది. ఇంట్లో కుండా, చట్టీ తప్ప మరేంలేదు. చినిగిపోయిన పేలికలు కట్టుకొని వళ్ళు కప్పుకుని బ్రతుకుతుంటారు. మరే ప్రాపంచిక బాధలూ లేవు. ఏ దిగులూ లేదు. ఎప్పుడూ అప్పుల్లో మునిగి వుంటారు. తిట్లూ-చీవాట్లూ, తన్నులూ తింటూ కూడ ఇసుమంత బాధపడరు. తిరిగి ఇస్తారన్న నమ్మకం లేకపోయినా, ఏదో పాపం ! ఆపదలో వున్నారని, వాళ్ళకు ఎంతో కొంత అప్పు యిస్తూ వుంటారు. బఠాణీ, ఆలుగడ్డలు తెచ్చుకొని కాల్చుకు తింటారు. లేదా, ఐదో, పదో చెరుకుగడలు విరుచుకొచ్చి రాత్రికి తింటారు. ఘీసూ ఇలా ఏ పనీ చేయకుండా అరవై సంవత్సరాలు గడిపాడు. మాధవ్ కూడా సుపుత్రునిలా తండ్రి అడుగుజాడల్లో నడవడమేకాక, తండ్రికి మించిన తనయుడని పేరు తెచ్చుకున్నాడు. ఇప్పుడు కూడా చలిమంట కెదురుగా కూర్చొని దొంగతనంగా తెచ్చుకున్న ఆలుగడ్డలు కాల్చుకుంటున్నాడు. ఘీసూ పెండ్లాం చనిపోయి చాలా కాలం అయింది. మాధవ్‌కు నిరుడే పెండ్లి అయింది. ఆ యింట్లో ఆమె అడుగుపెట్టినప్పటి నుంచీ ఒక నూతన పద్ధతికి పునాది వేసింది. పిండిలిసిరో, గడ్డి కోసుకొచ్చో, ఇంత తిండికి ఏర్పాటు చేసి ఆ పనికి మాలిన వాళ్ళ పొట్టలు నింపుతున్నది. ఆ అమ్మాయి వచ్చినప్పటి నుంచీ ఆ ఇద్దరూ మరీ పరమ సోమరిపోతులవడమేకాక, యిక మాకేం తిరుగులేదు, అన్నట్టు రొమ్ము విరుచుకొని తిరుగుతున్నారు. ఎవరయినా కూలికి పిలిస్తే అర్ధం లేకుండా రెట్టింపు కూలి అడుగుతారు. అదిగో ఆ అమ్మాయే, ఈనాడు ప్రసవవేదనతో చనిపోతే వాళ్ళు హాయిగా నిద్రపోవచ్చుననుకుంటున్నారు.

ఘీసూ ఆలుగడ్డలు వలుస్తూ - అరే ! కాస్త లోపలికెళ్ళి ఆ అమ్మాయి ఎలా వుందో చూసిరారా, ఏదో పిసాచి ప్రభావం అయివుంటుంది. భూత వైద్యుణ్ణి పిలుద్దామంటే ఒక రూపాయి అడుగుతాడు, గది లోపలికెళ్ళి చూసి వద్దామంటే, ఈలోపు ఘీసూ కాలిన బంగాళదుంప ముక్కలన్నీ తింటాడని మాధవ్ భయం. అందుకని, ఆమె దగ్గరకు వెళ్ళాలంటే నాకు భయం వేస్తున్నదన్నాడు మాధవ్.

" భయం ఎందుకురా ! నేను ఇక్కడే వున్నానుగా ! "

" అయితే నువ్వెళ్ళి చూసి రావచ్చు గా ! "

నా భార్య చనిపోయినప్పుడు, మూడు రోజులూ కదలకుండా అక్కడే కూర్చున్నాను. నేను ఆ అమ్మాయి దగ్గరకు వళితే నన్ను చూసి సిగ్గు పడుతుందిరా ! ఎన్నడూ నేను ఆమె ముఖమయినా చూడలేదే ! ఈనాడు అస్తవ్యస్తంగా పడివున్న ఆమెను ఎలా చూడను ? తన శరీరాన్ని కూడ మరచివున్న స్థితిలో నన్ను చూస్తే, ఆమె కాలూ చేయి కూడా కదల్చలేదు.

అబ్బాయో, అమ్మాయో పుడితే ఏం చేయాలి ? శొంఠిగాని, బెల్లంగాని, నూనెగాని యింట్లో ఏమీ లేవుగదా అని నేను ఆలోచిస్తున్నాను. అన్నీ వస్తాయి - భగవంతుడి దయవుంటే. ఇవ్వాళ ఒక్క పైసా ఇవ్వనివారు కూడా రేపు పిలిచి రూపాయలిస్తారు. నాకు తొమ్మిది మంది బిడ్డలు పుట్టారు. యింట్లో ఎప్పుడూ ఏమీలేదు. ఆ భగవంతుడు ఎలానో నన్ను ఒడ్డు ఎక్కించాడు.

రాత్రింబవళ్ళు కష్టపడి పనిచేసేవారి పరిస్థితి వీరి పరిస్థితి కంటే ఏమంత బాగాలేదు. రైతులతో పోలిస్తే రైతుల బలహీనతను సొమ్ముచేసుకొని, లాభించేవారే బాగావున్నారు. వారే సంపన్నులన్న భావం కలగడం పెద్ద ఆశ్చర్యం కాదు. రైతులకంటే ఘీసూయే ఆలోచనాపరుడని చెప్పవచ్చు. ఆలోచనలేని ఆ రైతు సమాజంలో కలసి పోయేదాని కంటే, వూరికినే కూర్చుని కాలక్షేపం చేసేవారి సమాజం మంచిదని ఘీసూ వెళ్ళి వారిలో కలిసాడు. అయితే వారి నీతి-నియమాలను పాటించే శక్తి అతనికి లేదు. అందుకని గ్రామ పెద్దలూ, పెత్తందారులూ కలిసి వున్న సమాజంలో కలిసి కూర్చోడం వల్ల నలుగురూ అతన్ని నిందిస్తారు. అయినా, అతని పరిస్థితి హీనంగావున్నా రైతులలాగా కష్టపడవలసిన అవసరం అతనికిలేదు కదా! అని తాను తృప్తి పడుతుంటాడు. అతని సరళ స్వభావాన్ని ఇతరులు ఉపయోగించుకొని లాభించలేరు కూడా.

ఇద్దరూ కాలే కాలే ఆలుగడ్డల్ని వలుచుకొని తింటున్నారు. నిన్నటి నుంచీ ఏమీ తినలేదు. ఆలు గడ్డలు కాస్త చల్లబడేవరకూ, తినకుండా వుండేఓర్పు వారికి లేదు. చాలా సార్ల ఇద్దరి నాలుకలూ కాలాయి. ఆలుగడ్డ పొట్టుఉన్నంతవరకూ పెద్ద కాలినట్టు అన్పించదు. కాని పండ్లకింద పడగానే లోపలిభాగం - అటు నాలుకకూ ఇటు అంగిల్ని కూడ కాల్చివేస్తుంది. ఆ స్థితిలో గబగబా మింగితే అదేచల్లబడుతుందనిపిస్తుంది. వారి కళ్ళవెంట , కన్నీళ్ళు వస్తున్నా యిద్దరూ త్వరత్వరగా మింగివేస్తున్నారు.

ఘీసూకు అప్పుడు యిరవైసంవత్సరాల క్రితం జమిందారు గారి అబ్బాయి పెండ్లికి వెళ్ళిన విషయం జ్ఞాపకం వచ్చింది. ఆనాటి విందులో అతనికి కలిగిన తృప్తి జీవితంలో ఎన్నటికి మరిచిపోలేనిది. ఆ భోజనం గుర్తుకువస్తే, నిన్ననో, మొన్ననో జరిగినట్లు అనిపిస్తుంది. అలాంటి భోజనం మళ్ళీ ఈనాటికి ఎక్కడా దొరకలేదంటాడు. పెళ్ళి కుమార్తె తరఫువారు అందరికీ ఎన్నెన్నో పూరీలు పెట్టారట. చిన్నలూ, పెద్దలూ అందరూ పూరీలు తిన్నారట. అవి స్వచ్ఛమయిన నేతితో చేసినవట. చట్నీ, మజ్జిగచారు, మూడురకాల ఇగురుకూరలు, ఒక పులుసుకూర, ఇంకా పెరుగు, మిఠాయిలు ఎన్నని చెప్పను ? ఆ విందు ఎంత బాగుందో ! తిన్నంత పెట్టారు. ఏది కావాలన్నా, ఎంత కావాలన్నా , ఎన్ని సార్లు అడిగినా పెట్టారు. మంచినీళ్ళు కూడ తాగటానికి వీలులేకుండా తిన్నాము. వడ్డించేవారు విస్తళ్ళమీద కమ్మని కచాడీలు వడ్డించి వెళ్ళేవారు. వద్దు, వద్దన్నా విస్తళ్ళమీద చేయి అడ్డంపెట్టినా వడ్డించి వెళ్ళేవారు. అంతా భోజనం చేసి చేతులు కడుక్కున్న తరువాత, తమలపాకులు, యాలుక్కాయలు ఇచ్చారు. కానీ, నిలబడి తాంబూలం తీసుకొనే ఓపికకూడా ఎవరికీ లేదు. వెంటనే వెళ్ళి కంబడిమీద పడుకున్నాను. అంతటి విశాల హృదయుడు ఆ జమీందారు.

మాధవ ఆ పదార్థాల పేర్లు విని స్వయంగా తిన్నంత అనుభూతిని పొందాడు. అతనికి నోరూరింది. ఇప్పుడు మాకు అలాంటి భోజనం ఎవరు పెడతారు ? అన్నాడు. ఇప్పుడు ఎవరూ అలాంటి భోజనం పెట్టలేరు. ఆ కాలం వేరు. అందరూ " పొదుపు పొదుపు " అంటున్నారు. పెండ్లిండ్లకూ దినాలకూ ఎక్కువ ఖర్చు పెట్టకూడదని చెపుతున్నారు. పేదల సొమ్ము కాజేసి ఎక్కడ దాచిపెడతారో అడుగు. ప్రోగుచేయడంలో తక్కువ చేయకూడదంట. ఖర్చుపెట్టడంలో మాత్రం పొదుపుకావాలట.

" నువ్వు ఇరవై పూరీలు తిని ఉండవచ్చు "

" ఇరవై కంటే ఎక్కువే తిన్నాను "


" నేనైతే యాభై తినేవాడ్ని "

" నేను యాభైకి యేమి తక్కువ తిని ఉండకపోవచ్చు "

నేను అప్పుడు చాలా బలంగా ఉండేవాడ్ని. నువ్వు నాలో సగం కూడా లేవు గదా ! "

ఆలుగడ్డ తిని ఇద్దరూ మంచినీళ్ళు తాగారు. ఆ చలిమంటలకెదురుగా కట్టుపంచెలు కట్టుకొని, రెండు కొండచిలువలు చుట్టలుచుట్టుకొని పడివున్నట్లుగా కాళ్ళు ముడుచుకొని వాళ్ళు నిద్రపోయారు. పాపం బుధియా ఇప్పటిదాకా మూల్గుతూనే వుంది.

**ఘీసూ ఆలుగడ్డలు వలుస్తూ - అరే ! కాస్త లోపలికెళ్ళి ఆ అమ్మాయి ఎలా వుందో చూసిరారా, ఏదో పిసాచి ప్రభావం అయివుంటుంది. భూత వైద్యుణ్ణి పిలుద్దామంటే ఒక రూపాయి అడుగుతాడు, గది లోపలికెళ్ళి చూసి వద్దామంటే, ఈలోపు ఘీసూ కాలిన బంగాళదుంప ముక్కలన్నీ తింటాడని మాధవ్ భయం. అందుకని, ఆమె దగ్గరకు వెళ్ళాలంటే నాకు భయం వేస్తున్నదన్నాడు మాధవ్.**



* * *

పొద్దున్నే లేచి మాధవ్ గదిలోకి వెళ్ళి చూసాడు. అతని భార్య చనిపోయి వుంది. ఆమె ముఖం నిండా ఈగలు ముసురుకొని వున్నాయి. ఆమె గ్రుడ్లు తేలవేసి వుంది. వంటి నిండా దుమ్ము కొట్టుకొని వుంది. ఆమె కడుపులోనే బిడ్డ చనిపోయి వుంది.

మాధవ్ పరిగెత్తుకొని ఘీసూ దగ్గరకు వచ్చాడు. ఇక యిద్దరూ వామ్మో వాయ్యో అంటూ పెద్దగా ఏడుస్తూ గుండెలు బాదుకున్నారు. ఈ ఏడుపులు, పెడ బొబ్బలు విని, ఇరుగుపొరుగు వారు పరిగెత్తుకుంటూ వచ్చారు. పురాతన సాంప్రదాయం ప్రకారం ఆ దురదృష్టవంతులనిద్దరిని ఓదార్చారు. కాని ఎక్కువసేపు ఏడ్వటానికి కూడ అవకాశం లేదు. శవ-వస్త్రం కావాలి. కట్టెలు కావాలి. గ్రద్ద గూటిలో మాంసం ముక్కకూడ మిగలనట్టు, ఇంట్లో ఒక్క దమ్మిడీ లేదు. అయ్యాకొడుకూ ఇద్దరూ ఏడుస్తూ ఆవూరి జమీందారు దగ్గరకు వెళ్ళారు. ఆ యిద్దరు ముఖం చూడాలంటేనే ఆయనకు పరమ అసహ్యం. దొంగతనం చేసినందుకు, పనికి వస్తామని చెప్పి రానందుకూ చాలా సార్లు వాళ్ళను కొట్టడం కూడ జరిగింది. అయినా, ఒరే ఘీసూ ! ఎందుకురా ఏడ్చేది ? ఈ మధ్య నువ్వు ఎక్కడా కనబడటలేదే ! ఈవూళ్లో వుండాలని అనుకోవడంలేదా నువ్వు ?అని అడిగాడు.

ఘీసూ నేలకు తలవాల్చి, ఏడుస్తూ ఇలా అన్నాడు. అయ్యా ! నేను పెద్ద ఆపదలో వున్నాను. మాధవ్ పెండ్లాం తెల్లవార్లూ గిలగిలా కొట్టుకొని ప్రాణం విడిచింది. మేం ఇద్దరం ఆమె తల దగ్గరే కూర్చుని వున్నాం. మా శక్తి కొద్ది మందు మాపు యిప్పించాం. కాని ఆమె మమ్మల్ని ముంచి వెళ్ళిపోయింది. ఇక మాకు రొట్టె తుంపు వేసేవాండ్లు కూడా ఎవరూలేరు బాబుగారు ! సర్వ నాశనం అయిపొయ్యాం. మాకొంప కూలిపోయింది. మీ సేవకుడ్ని దొరా ! ఇక మీరు తప్ప ఆమెను మట్టి చేయడానికి సాయం చేసేవారుకూడా ఎవరూ లేరు సామీ. మాదగ్గర వున్నదంతా ఆమె మందూ-మాకుకే ఖర్చు అయిపోయింది. ఏదో మీ దయవుంటే, ఆమెను మట్టి చేస్తాం. మీరు తప్ప మాకు వేరే దిక్కులేదు.

జమీందారుగారు జాలి మనిషి. కాని ఘీసూ మీద జాలిచూపడం తెల్ల దుప్పటి మీద రంగువేయడంలాంటిది. " నువ్వు ముందు యిక్కడినుంచి వెళ్ళిపో " పిలిచినా రాని వెధవ్వ. ఇవ్వాల నీకు అవసరం వచ్చింది కనుక ముఖస్తుతి మాటలు మాట్లాడుతున్నావా ?విశ్వాసం మాలిన వెధవా ! అని అందామనిపించింది. కాని, కోపపడడానికి, దండించడానికి యిది సమయం కాదు, కనుక యిష్టం లేకపోయిన రెండు రూపాయలు తీసి విసిరివేసాడు. కాని, ఆయన నోటినుంచి ఒక్క ఓదార్పు మాట కూడ రాలేదు సరికదా ! నెత్తిమీద బరువు దింపుకున్నట్లుగా వాడివైపు కన్నెత్తి చూడనుకూడా చూడలేదు. జమీందారుగారే రెండు రూపాయలు యిచ్చినపుడు, యిక ఆ వూర్లోవున్న షావుకార్లు, వడ్డీవ్యాపారుస్తులు యివ్వము అని అనగలరా ? ఘీసూకు జమీందారుగారి పేరుమీద దండోరా వేయడం బాగా తెలుసు.

కొందరు రెండు అణాలిచ్చారు. కొందరు పావలా యిచ్చారు. ఒక్క గంటలో ఘీసూ దగ్గర ఐదురూపాయలు పోగయినాయి. కొందరు గింజలు పెట్టారు. మరికొందరు కట్టెలు యిచ్చారు. మధ్యాహ్నం ఘీసూ - మాధవ్ బజారులో శవ-వస్త్రం తీసుకురావడానికి వెళ్ళారు. ఇటు నలుగురు గుసగుసలు చెప్పుకుంటున్నారు. వూళ్ళో జాలి హృదయం గల స్త్రీలు వచ్చి శవాన్ని చూచి రెండు కన్నీటిబిందువులు రాల్చి వెళ్ళిపోయారు.

* * *

బజారుకు వెళ్ళిన తరువాత ఘీసూ యిలా అన్నాడు.

కట్టెలు ఆమెను తగలెయ్యడానికి చాలినన్ని దొరికాయి కదా మాధవ్ ?

మాధవ్ : ఆ.... కట్టెలు చాలా వున్నాయి. ఇక యిప్పుడు శవ-వస్త్రం కావాలి.

అయితే పద ! ఏదో తక్కువ ధరలో తీసుకుందాం. ‘ కాక మరేమిటి ? శవాన్ని ఎత్తుకెళ్ళేటప్పటికి చాలా పొద్దు పోతుంది. రాత్రివేళ శవ వస్త్రాన్ని ఎవరు చూస్తారు ?

ఇది ఎంత ముదనష్టపు సాంప్రదాయం. బతికివుండగా వంటిమీద చినిగిన పేలిక లేకపోయినా, చచ్చిపోయినపుడు మాత్రం కొత్తబట్ట కావాలి.

“ ఆ కొత్తబట్ట శవంతోపాటు కాలిపొయ్యేదేగా ? ఆ.... కాకమిగిలేది ఏముంటుంది ? ఈ ఐదురూపాయలు ముందే మనకు దొరికినట్లయితే, కాస్త మందూ-మాకూ యిప్పించే వాళ్లం కదా?”

యిద్దరూ ఒకరొకరి మనోభావాల్ని పసిగడుతున్నారు. బజారులో యిటూ - అటూ తిరుగుతున్నారు. కాసేపు బజాజ్ దుకాణానికి వెళ్ళారు. ఇంకాసేపటికి మరో దుకాణానికి, రకరకాలయిన బట్టలు పట్టువీ, నూలువీ అన్నీచూసారు. కానీ ఏవీ నచ్చలేదు. ఇంతలో సాయంత్రం అయింది. అప్పుడు ఇద్దరూ ఏ దైవ ప్రేరణతోనో, ఒక సారా దుకాణం ముందుకు చేరారు. అంతకు ముందే అనుకున్న ప్రకారం దుకాణం లోపలికి వెళ్ళిపోయారు. కాసేపు అక్కడ యిద్దరూ సందిగ్ధావస్థలో నిలబడ్డారు. తరువాత గీసూ కౌంటర్ ముందుకెళ్ళిమాకు కూడా ఒక బాటిల్ యివ్వండి అన్నాడు.

తరువాత మాంసపు-రొట్టెలు వచ్చాయి. వేయించిన చేపలు వచ్చాయి. యిద్దరూ వరండాలో కూర్చొని ప్రశాంతంగా తాగడం మొదలెట్టారు. చాల ‘ఔన్సు’ లు తాగి ఇద్దరూ నిషాలోకి వెళ్ళిపోయారు.

“ శవానికి కొత్త బట్ట కట్టితే ఏం వస్తుంది ? అది కూడా కాలిపోయేదే కదా ? కోడలితోపాటు అదేం వెళ్ళదు గదా ? అంటాడు ఫీసూ.

మాధవ్ ఆకాశంవైపు చూస్తూ తనకే పాపం తెలియదన్నట్లుగా, దైవసాక్షిగా చెపుతున్నట్లుగా ఇలా అంటాడు. ఇది ప్రపంచ ఆచారమా ? కాదు. ప్రజలు బ్రాహ్మణులకు వేలాది రూపాయలు ఎందుకు దానం చేస్తున్నారు ? పరలోకం వుందో లేదో ఎవరు చూసారు ?

పెద్ద వాండ్ల దగ్గర డబ్బు వుంటుంది కనుక వారు ఖర్చు పెడతారు. మనదగ్గర ఖర్చు పెట్టడానికి ఏముంది ?


“ కాని శవానికి కొత్త బట్ట ఏది ? అని అడిగితే నలుగురికీ ఏం సమాధానం చెపుతావు ?”

ఫీసూ నవ్వాడు “ డబ్బులు నడుముకు కట్టుకుంటే ఎక్కడో జారిపోయాయి. వెదికినా కనబడలేదు. ” అని చెప్పితే నమ్మకపోయినా, మళ్ళీ వాళ్ళే యిస్తారు అన్నాడు.

అనుకోకుండా కలిసివచ్చిన యీ అదృష్టానికి మాధవ్ కూడా నవ్వాడు. పాపం ! ఆమె చాలా మంచిది. చచ్చినా, మన పొట్టలు నింపి మరీ చచ్చింది.

సగం బాటిల్‌కు పైగా అయిపోయింది. ఫీసూ రెండు సేర్లు పూరీలూ, చట్నీ, ఊరగాయ, గుండె మాంసం తెప్పించాడు. సారాయి దుకాణానికి ఎదురుగానే ఈ దుకాణం వుంది. మాధవ్ ఒక్క దూకుదూకి ఇవ్వన్నీ పట్టుకొచ్చాడు. మొత్తం రూపాయిన్నర ఖర్చుఅయింది. ఇక కాసిని చిల్లర డబ్బులు మాత్రం మిగిలాయి.

అడవిలో మృగరాజు ఒక జంతువును చంపి, ఎంతో ఠీవిగా కూర్చొని తిన్నట్లుగా, వీరిద్దరూ అంత ఠీవీగా కూర్చొని



పూరీలు తింటున్నారు. ఎవరికీ జవాబు చెప్పాల్సిన భయమూ లేదు. నలుగురూ ఏమన్నా అనుకుంటారేమోనన్న విచారమూ లేదు. ఇలాంటి ఆలోచనలన్నీ వారు ఎప్పుడో అధిగమించారు.

ఫీసూ వేదాంత దొరణిలో - మన ఆత్మతృప్తి పడితే ఆమెకు పుణ్యం రాదంటావా ? అన్నాడు.

మాధవ్ వినయంగా తలవంచి, తప్పకుండా పుణ్యం వస్తుంది అని, తండ్రి అన్నదాన్ని సమర్థించాడు. భగవాన్ నువ్వు సర్వాంతర్యామివి. ఆమెను వైకుంఠానికి తీపుకుపో, మేం యిద్దరం హృదయపూర్వకంగా ఆశీర్వదిస్తున్నాం. ఇవ్వాళ మాకు లభించిన భోజనం జీవితంలో ఎన్నడూ లభించలేదు అన్నాడు. ఒక్క క్షణం తరువాత మాధవ్‌కు మనుసులో ఒక సందేహం కలిగి “ అయ్యా మనం కూడా ఒకనాడు అక్కడకు వెడతాం గదూ ?” అని అడిగాడు.

ఫీసూ ఇప్పుడు ఆ పిచ్చి ప్రశ్నకు సమాధానం చెప్పి, పరలోకానికి సంబంధించిన విషయాలు ఆలోచించి, అనుభవించే పరమానందాన్ని పాడుచేసుకోదలుచుకోలేదు.

అక్కడ మనల్ని ఆమె నాకు, మీరు శవ వస్త్రం ఎందుకు తేలేదు ? అని అడిగితే ఏం చెపుతాం ?

నీ తలకాయ ! చెపుతాం. ఆమెకు శవ-వస్త్రం దొరకదని నీకెలా తెలుసు ? నువ్వు నన్ను పరమ మూర్ఖుడనుకున్నావా ? నా యీ అరవై సంవత్సరాల జీవితం వృధాగా గడిపాననుకున్నావా ? ఆమెకు శవ -వస్త్రం దొరుకుతుంది. మనం అనుకున్నదానికంటే మంచిది దొరుకుతుంది నమ్ము.

మాధవ్‌కు నమ్మకం కలగక ఇలా అంటాడు - ఎవరు ? ఎవరు యిస్తారు ? డబ్బంతా నువ్వు కరగతిన్నావు. ఆమె నన్ను అడిగేది. ఆమె మెళ్ళో తాళికట్టింది నేను.

ఫీసూ కోపంతో యిలా అంటాడు - ఆమెకు శవ-వస్త్రం దొరుకుతుంది అంటే నువ్వు నమ్మవేం ?

ఎవరు యిస్తారో చెప్పరాదు ?

యిప్పుడు ఎవరు యిచ్చారో వాళ్ళే యిస్తారు. అయితే యీసారి మన చేతికి యివ్వరు అంతే.

చీకటి పెరిగినకొద్ది నక్షత్రాల కాంతి యింకా ఉజ్వలమవుతున్నది. అలానే మధుశాల మరింత కళకళ లాడుతున్నది. ఒకడు పాడుతున్నాడు. మరికడు తన గొప్పలు చెప్పుకుపోతున్నాడు. ఇంకొకడు స్నేహితుని మెడ చుట్టుకుపోతున్నాడు. మరొకడు మద్యపు పాత్రను స్నేహితుని నోటిదగ్గర పెడుతున్నాడు.

అక్కడి వాతావరణం అంతా మత్తుమయం. ఎందరో అక్కడికి వస్తున్నారు. ఉద్ధరిణెడు త్రాగి ఊగిపోతున్నారు. సారా కంటే ఎక్కువగా అక్కడి వాతావరణం మత్తెక్కిస్తున్నది.జీవితపు బాధలు వాళ్ళను అక్కడకు లాక్కొస్తున్నాయి. కాసేపు బతుకు - చావు రెండు ‘ మిధ్య ’ అనే ధోరణిలో వారు తన్మయులైపోతున్నారు.

తండ్రీ కొడుకు యిద్దరూ, ఆనందంగా గుటకలు వేస్తున్నారు. అందరూ వాళ్ళ వైపే చూస్తున్నారు. నిండు బాటిల్ వారి మధ్య వున్నది కనుక, ఆ యిద్దరినీ మహ అదృష్టవంతులుగా వారు భావిస్తున్నారు.

తాను పొట్ట పగిలేటట్టుతిని, మాధవ్ మిగిలిన పూరీలను ఒక విస్తరలో పెట్టాడు. ఎదురుగా నిలబడి ఆకలితో ఆశగా చూస్తున్న ఇక బిచ్చగానికి ఇచ్చాడు. ఒకరికి పెడితే వచ్చే గౌరవం కలిగే ఆనందం, ఉత్సాహం ఇతని జీవితంలో మెదటసారి అనుభవించాడు.

“ తీసుకుపోరా బాగాతిని ఆశీర్వదించు. దీనిని సంపాదించిన యజమానురాలు గతించింది. కానీ నీ ఆశీర్వాదం ఆమెకు తప్పక అందుతుంది. ఇది కష్టపడి సంపాదించిన డబ్బు. మనసారా ఆశీర్వదించు ” అంటాడు ఫీసూ.

మాధవ్ “ మళ్ళీ ఆకాశంవైపు చూస్తు అయ్యా ! ఆమె తప్పకుండా, వైకుంఠానికే వెళ్ళుతుంది. వైకుంఠానికి రాణీ కూడా అవుతుంది ” అంటాడు.

ఫీసూ నిలబడ్డాడు. ఆనందడోలికలలో ఊగుతూ యిలా అంటాడు- ఔనురా, ఆమె తప్పక వైకుంఠానికే వెళుతుంది. ఆమె ఎప్పుడు ఎవర్నీ పీడించలేదు. భాదించలేదు. చచ్చిపోతూకూడా మన చివరి కోరికను తీర్చి మరీ వెళ్ళింది. ఆమె వైకుంఠానికి వెళ్లకపోతే,- పేదల్ని రెండు చేతులా దోచుకొని, తమ పాప పరిహారం కోసం గంగలో స్నానంచేసి, దేవాలయాలలో అభిషేకాలు చేయించే ఈ పెద్దమనుషులా వైకుంఠానికి వెళ్ళేది ?

కాసేపట్లో యీ పూజ్యభావం కాస్తా మటుమాయమవుతుంది. అస్థిరత్వం మత్తుకు వున్న ప్రత్యేకత. మళ్ళీ దుఖం పుట్టుకొచ్చింది. నిరాశ పెల్లుబికి వచ్చింది.

కాని అయ్యా, పాపం ! ఆమె జీవితంలో దు:ఖమే అనుభవించింది. ఎన్నెన్నో కష్టాలు సహించి, సహించి ఆమె వెళ్ళిపోయింది. అని అంటూ కళ్ళకు చేతులు అడ్డం పెట్టుకొని పెద్దగా ఏడుస్తున్నాడు మాధవ్.ఫీసూ ఓదార్చుతూ, ఎందుకురా ఏడుస్తావు ? ఆమె ఈ మాయాజాలం నుంచి విముక్తురాలయినందుకు నువ్వు సంతోషించాలిరా. ఈ మాయామోహబంధాలును తెంచుకొని వెళ్ళిన ఆమె ఎంతో అదృష్టవంతురాలురా. అంటూ యిద్దరూ నిలబడి మాయా ! ఎందుకు మాకళ్ళను మెరిపిస్తావు ? మాయా ! అనే పాట పాడుతున్నారు. తాగేవారంతా వాళ్ళ వైపే చూస్తున్నారు. ఈ యిద్దరూ మైమరచి పాడారు. ఎగిరారు. దూకారు. కులుకుతూ నడిచారు. అర్థం చెప్పారు. అభినయం చేసారు. చివరకు నిషా ఎక్కువయి అక్కడే పడిపోయారు.